పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



పండ్ల మార్కెట్ వద్ద చేతి సంచిని అందజేస్తున్న లయన్ అన్నెం కోటిరెడ్డి

మోతీనగర్: పర్యావరణ పరిరక్షణ కోసం జ్యూట్, బట్ట, జనుము వంటి వాటితో తయారు చేసిన చేతి సంచులనే వాడాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, పర్యావరణ పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ అన్నెం కోటి రెడ్డి అన్నారు. 'ప్లాస్టిక్ వద్దు.. గుడ్డ సంచులే ముద్దు' అనే నినాదంతో నగరంలోని పలు వారాంతపు సంతలు, రైతు బజారులలో ఆదివారం బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పంపిణీ కార్యక్రమం నిరంతరం కొనసాగించి, కోటి బ్యాగులను పంపిణీ చేయటమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

ఫ్లైఓవర్ పనులు.. ట్రాఫిక్ ఆంక్షలు



సూచిక బోర్డు ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీసులు

నిజాంపేట్: మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాచుపల్లి జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. తాత్కాలికంగా బాచుపల్లి జంక్షన్‌ను మూసివేశారు. బాచుపల్లి జంక్షన్‌కు బదులుగా ప్రత్యామ్నాయ మార్గాలు చూపించారు. మల్లంపేట రోడ్డు నుంచి మియాపూర్ రోడ్డు వైపు వచ్చే వాహనాలు ఎడమవైపునకు అంగారా రెస్టారెంట్ వద్ద యూ టర్న్ తీసుకుని మియాపూర్ రోడ్డు, నిజాంపేట్ రోడ్డు వైపు వెళ్లవచ్చు. అలాగే నిజాంపేట్ రోడ్డు నుంచి గండిమైసమ్మ రోడ్డు వైపు వచ్చే వాహనాలు ఎడమవైపునకు మమత హాస్పిటల్ వద్ద యూ టర్న్ తీసుకుని గండిమైసమ్మ రోడ్డు, మల్లంపేట రోడ్డు వైపు వెళ్లవచ్చని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వాహనదారులు సహకరించాలని కోరారు.

పాఠశాలలో ఫర్నిచర్ ధ్వంసం చేసిన బిల్డింగ్ యజమాని

జీడిమెట్ల: బిల్డింగ్ యజమాని తాను అద్దెకు ఇచ్చిన స్కూల్‌లో చొరబడి ఫర్నిచర్, కంప్యూటర్స్ ధ్వంసం చేశాడు. ఈ ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ విలేజ్‌లో కె.చాయాదేవి వెంకటరెడ్డికి చెందిన నాలుగు అంతస్తుల భవనాన్ని 15 సంవత్సరాలు అగ్రిమెంట్ చేసుకుని ఓ ప్రైవేట్ స్కూల్‌ను నడిపిస్తుంది. శనివారం అర్ధరాత్రి బిల్డింగ్ యజమాని వెంకటరెడ్డి, అతని భార్య, కూతురు, మరో 50 మందితో కలిసి స్కూల్ వద్దకు చేరుకున్నారు. అందరూ కలిసి స్కూల్ తాళాలు పగులగొట్టి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యం

ఎమ్మెల్యే గాంధీ

చందానగర్: చందానగర్ పీజేఆర్ స్టేడియంలో అథ్లెటిక్స్ ఎస్‌ఐఎస్ ఆర్గనైజింగ్ అధ్యక్షులు ఎంవీ ప్రసాద్ ఆధ్వర్యంలో ముద్దనాస్ తెలంగాణ ఓపెన్ ప్రైజ్ మనీ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గాంధీ హాజరై మాట్లాడుతూ.. క్రీడాకారులలో దాగిన సృజనాత్మకతను వెలికితీయడానికి క్రీడలు తోడ్పడతాయన్నారు. పిల్లలకు చదువుతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని అన్నారు. అనంతరం బ్యాడ్మింటన్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, నాయకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, నరేందర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి

సనత్‌నగర్: కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ డివిజన్‌లోని సుందర్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఇటీవల నూతనంగా ఎన్నికైంది. ఈ నేపథ్యంలో ఆదివారం నూతన కమిటీ సభ్యులు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను తెలుసుకుని తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు కంజర్ల అమర్నాథ్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి రవి కుమార్ పాల్గొన్నారు.

కొత్త రేషన్!

- నూతన లబ్ధిదారులకు ఈనెల నుంచి సన్నబియ్యం
- నిరీక్షణకు తెరదించిన ప్రభుత్వం
- దరఖాస్తులపై కొనసాగుతున్న పరిశీలన
- మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 5,29,698 కార్డులు
- 17,71,767 మంది సభ్యులు



సాక్షి,సిటీబ్యూరో: రేషన్ (ఆహారభద్రత) కార్డులు, వాటిలో కొత్తగా సభ్యుల పేర్ల చేర్పులు/ మార్పుల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారి నిరీక్షణకు ప్రభుత్వం తెరదించింది. నూతన లబ్ధిదారులకు ఈనెల (మే) నుంచి రేషన్‌బియ్యం పంపిణీ చేస్తోంది. మీ సేవ, ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికి ప్రభుత్వం కొత్తరేషన్‌కార్డులను కూడా మంజూరు చేసింది. సభ్యుల చేర్పుకోసం దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు కూడా కార్డుల్లో నమోదవుతున్నాయి. ఇప్పటికే అధికశాతం పేర్లు రేషన్‌కార్డుల్లో చేర్పులు/ మార్పులు జరిగాయి. ఈనెల నుంచి వీళ్లందరికీ సన్నబియ్యం మంజూరు చేసినట్లు పౌరసరఫరాల శాఖ అధికార వర్గాలు చెబుతున్నాయి.

నిరీక్షణకు తెర..

కొత్త రేషన్ కార్డుల కోసం ఐదేళ్లుగా అర్హులైన నిరుపేద కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. రేషన్ కార్డుల్లో పేర్లు తొలగించుకుని నూతనంగా దరఖాస్తులు చేసుకున్న వారు కూడా చాలామంది ఉన్నారు. కొత్తకార్డులు మంజూరు లేక, సభ్యుల నమోదు కాక ప్రభుత్వ పథకాలు, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాలకు ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు ప్రభుత్వం కొత్త కార్డుల మంజూరుతో పాటు నూతన సభ్యులను చేర్చడంతో దరఖాస్తుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రయోజనం ఇలా

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 818 కొత్తరేషన్ కార్డులు మంజూరయ్యాయి. అలాగే 33 వేలమంది ఉన్న రేషన్‌కార్డుల్లో సభ్యులుగా చేరారు. దీంతో నూతనంగా మొత్తం 17,71,767 సభ్యుల పేర్లు కొత్తగా రేషన్‌కార్డుల్లో నమోదయ్యాయి. ఈనెల నుంచే నూతన లబ్ధిదారులకు రేషన్‌బియ్యాన్ని అందించనున్నారు. వీరందరికీ ఈ నెలలో పంపిణీ చేసేందుకు జిల్లాకు 11 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మంజూరు చేశారు.

◆ ఆహార భద్రత కార్డులోని ప్రతీ సభ్యుడికి 6 కిలోలు.. అంత్యోదయ కార్డులోని వారికి 35 కిలోలు, అన్నపూర్ణ కార్డు కలిగిన వారికి 10 కిలోల చొప్పున సన్నబియ్యం అందించనున్నారు.

పెండింగ్‌లో 3 వేలు

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో రేషన్ (ఆహార భద్రత) కార్డుల్లో చేర్పులు/మార్పులకు సంబంధించి 38 వేల దరఖాస్తులు మీసేవ ద్వారా రాగా.. ఇప్పటి వరకు 33 వేల మందిని రేషన్‌కార్డుల్లో సభ్యులుగా పౌరసరఫరాల శాఖ చేర్చింది. ఇవిపోగా, మిగతా 3 వేల మ్యూటేషన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సంబంధిత అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

◆ కొత్త రేషన్‌కార్డుల కోసం మీ సేవతోపాటు ప్రజాపాలనలో పెట్టుకున్న దరఖాస్తులు కూడా వందల్లో పెండింగ్‌లో ఉండగా.. వాటిని రెవెన్యూ అధికారులు పరిశీలించడంతో పాటు విచారణ నిర్వహిస్తున్నట్లు సంబంధిత శాఖ వర్గాలు చెబుతున్నాయి. జిల్లాలో ఇప్పటికే కొత్తగా మంజూరు చేసిన 818 రేషన్‌కార్డులను కలుపుకొని మొత్తంగా 5,29,698 రేషన్ (ఆహారభద్రతా) కార్డులు ఉన్నాయి.

దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ

మీ–సేవ, ప్రజాపాలన దరఖాస్తుదారుల్లో అర్హులను గుర్తించి కొత్త కార్డుల మంజూరు చేయటంతో పాటు చేర్పులు/మార్పుల్లో నూతన లబ్ధిదారులను చేర్చాం. వారికి రేషన్ దుకాణాల్లో ఈ నెల(మే) నుంచి సన్నబియ్యం అందిస్తాం అర్హులు కొత్త కార్డుల కోసం, చేర్పుల కోసం దరఖాస్తు పెట్టుకోవచ్చు. దరఖాస్తుల స్వీకరణ నిరంతరంగా సాగుతోంది.

– శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్‌ఓ, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్‌లో టీవీఆర్ నగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. నిరుపేదలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబురావు, కృష్ణారావు, శ్యామల రాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం



ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించి, వారికి మెరుగైన వైద్య సేవలను అందించేందుకు వంశీ ఆసుపత్రి నిర్వాహకులు ముందుకు రావడం అభినందనీయమని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. బీజేపీ ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ ఇన్‌చార్జి ఎనుగుల తిరుపతి ఆధ్వర్యంలో హరిజన బస్తీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య శిబిరం కొనసాగింది. బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు, కంటి చూపు, అస్తామా, అలర్జీ, సైనసైటిస్, బ్రీతింగ్ సమస్యలు, తదితర వాటికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సంతోష్‌గౌడ్, జగదీష్, మనోజ్, రమేష్, సాయి, శేఖర్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ దేశానికి ఆదర్శం



సన్నబియ్యంతో సహపంక్తి భోజనం చేస్తున్న నాయకులు

మోతీనగర్: ప్రజా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్నబియ్యం పంపిణీలో రాష్ట్రం దేశానికి ఆదర్శమని కాంగ్రెస్ నగర ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్ అన్నారు. ఆదివారం పాండురంగనగర్ సమీపంలోని హేమావతి నగర్‌లోని లబ్ధిదారురాలు బి. మణెమ్మ ఇంటిలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్నబియ్యంతో అన్నం తినాలంటే ఏదో ఒక శుభకార్యం ఉండాల్సిందేనని, నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు నిత్యం మూడు పూటలా సన్నబియ్యంతో భోజనం చేసేలా కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ రమేష్ నాయక్, నాయకులు దూడల సురేష్ గౌడ్, గంట మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల సంరక్షణ అందరి బాధ్యత



మియాపూర్: చెరువుల సంరక్షణ మనందరి బాధ్యత అని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. షెక్సెస్ సెలెక్ట్ మాల్స్ కంపెనీ సీఎస్‌ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగావాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న పటేల్ చెరువు సుందరీకరణ పనులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మియాపూర్ డివిజన్ పరిధిలో పటేల్ చెరువు, గురునాథం చెరువు, మక్తమహబూబ్‌పేట్ పెద్దకుడి చెరువు, రామసముద్రం కుంట చెరువు, నాయినమ్మ కుంట చెరువు సుందరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. త్వరలోనే చెరువుల రూపురేఖలు మారనున్నాయని తెలిపారు.

చెట్లు నరికారని ఫిర్యాదు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని ఓ గేటెడ్ కమ్యూనిటీలో దాదాపు 30 చెట్లను కొట్టివేశారంటూ ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ నిసర్గ ఆదివారం ఫిర్యాదు చేసినట్లు జీహెచ్ఎంసీ, అటవీశాఖ అధికారులు తెలిపారు. ఆ ప్రాంతాన్ని పరిశీలించి అనుమతి లేకుండా చెట్లను కొట్టివేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఆకులు రాలుతుంటే తొలగించేందుకు మనుషులను ఏర్పాటు చేయాలే కానీ చెట్లను కొట్టివేయడమేమిటని పలువురు అంటున్నారు.

ప్రశాంతంగా 'నీట్'

సనత్‌నగర్: అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశం కోసం నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)–2025 ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 720 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 706 మంది హాజరయ్యారు. బేగంపేట పీజీ కళాశాలలో 720 మంది అభ్యర్థులకు గాను 704 మంది పరీక్ష రాశారు. బేగంపేటలో ఆయా కేంద్రాల వద్ద బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, సిబ్బంది గట్టి బందోబస్తు నిర్వహించారు. ఇక అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 240 మంది విద్యార్థులకు గాను 236 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు.

నార్త్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో 11 కేంద్రాలు

నార్త్‌జోన్ ట్రాఫిక్ పరిధిలో నీట్ పరీక్ష కోసం 11 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా 5,000 పైచిలుకు విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలకు దారితీసే అన్ని ముఖ్యమైన జంక్షన్లు,రోడ్ల వద్ద ట్రాఫిక్ సిబ్బందిని నియమించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూశారు.



ఎల్‌డీ ప్రసాద్ ఆశయ సాధనకు కృషి చేయాలి



సంస్మరణ సభలో పాల్గొన్న కార్యకర్తలు

కూకట్‌పల్లి: ఎల్‌డీ ప్రసాద్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్(టాప్రా), సీపీఎం నాయకులు అన్నారు. ఆదివారం హెచ్‌ఎంటీ హిల్స్ కమ్యూనిటీ హాల్‌లో సంస్మరణ సభ జరిగింది. ఆయన చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. సీపీఎం అభివృద్ధి కోసం ప్రసాద్ ఎంతో కృషి చేశారని అన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఎన్నో ఉద్యమాలు, పోరాటాల్లో స్వయంగా పాల్గొంటూనే తన చుట్టూ ఉన్న పెన్షనర్స్ అందరిని కూడ గట్టి ఉద్యమంలో పాల్గొనేలా చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ టాప్రా రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, మోహన్‌రావు, అరుణ, నరహరి, శంకరరావు, రామారావు, సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు నరసింహారావు, జిల్లా కార్యదర్శి పి. సత్యం, బాలానగర్ మండల కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్, కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం శంకర్, బాచుపల్లి మండల కార్యదర్శి బి వెంకటరామయ్య, జేవీవీ రాష్ట్ర నాయకులు ఆర్. వరప్రసాద్, వెంకటరాజ్యం పాల్గొన్నారు.

కామాక్షి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సామూహిక ఉపనయనం



కార్యక్రమంలో పాల్గొన్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

ఆల్విన్‌కాలనీ: కామాక్షి బ్రాహ్మణ సంఘం నిజాంపేట్ ఆధ్వర్యంలో హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ సెవెన్ హిల్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం సామూహిక ఉపనయనాలను నిర్వహించారు. ఆయా ప్రాంతాలకు చెందిన 9 మంది వటులకు వేద పండితులు దుర్గా చరణ్ ఉపనయన సంస్కార క్రతువులు నిర్వహించారు. డాక్టర్ మారేపల్లి భువనేశ్వరి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. సభలో ప్రముఖ కవి, రచయిత పుట్టమురాజు రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. సంస్కృతి, ధర్మాన్ని పరిరక్షించడంలో అందరూ ఐక్యంగా ముందుకు రావాలని అన్నారు. అనంతరం గరిమెపూడి రాధాకృష్ణ మూర్తి, ప్రముఖ సినీ నటులు సుబ్బరాయ శర్మ, రామా వివేకానంద, డాక్టర్ కావూరి శ్రీనివాస శర్మలు మాట్లాడారు. ఘంటసాల సంగీత సాధనాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి గీతాలాపన ఆహుతులను ఎంతగానో అలరించాయి. అనంతరం అన్నదాన వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో సుధాకర్, నరసింహారావు, శ్రీనివాస్, కరుణాకర్, మాణిక్యాలరావు, శంకర్, రామారావు, లక్ష్మీనారాయణ, వెంకటరమణి, కల్యాణి, పార్వతి, బాల పరమేశ్వరి, పద్మావతి, జయశ్రీ, అనిత, ఛాయాదేవి, గౌరీ, కులకర్ణి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నిజాంపేట్: నిజాంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. 2011–12 విద్యా సంవత్సరంలో పదో తరగతి కలిసి చదివిన వారిని ఆ వేదిక ఒక్క చోటికి చేర్చింది. ఒకరికొకరు గుర్తు పట్టుకోలేనంతగా మారిపోయిన తమ చిన్ననాటి స్నేహితులను ఒక్కసారిగా చూడగానే పులకించిపోయారు. ప్రస్తుత గురువులతో పాటు వారి జీవితాల్లో వెలుగులు నింపే దిశగా పునాదులు వేసిన ఆనాటి గురువులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. చివరిగా తమకు చదువుకున్న బడిలో చిన్ననాటి స్నేహితులు పంచిన ఆనందాల ఒడిని ఒడిసిపట్టుకుని మళ్లీ ఎప్పుడు కలుస్తామో.. అంటూ భారమైన అడుగులతో ప్రాంగణాన్ని వీడి తమ గమ్యం వైపు సాగిపోయారు. అనంతరం నిజాంపేట్ జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ ఉపాధ్యాయుడు ముక్కర్ల లాలయ్య 62 వసంతాలు పూర్తి చేసుకుని 63వ వసంతంలోకి అడుగిడిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు.

పార్కులను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే వివేకానంద్



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: కాలనీల్లోని పార్కులను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం గాజులరామారం డివిజన్ మహదేవపురంలో రూ. 90 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన పార్కును, ఉషోదయ కాలనీ ఫేజ్–2లో రూ.80 లక్షలతో నిర్మించిన విఘ్నేశ్వర పార్కు, సమగ్ర పార్కులను కార్పొరేటర్ రావుల శేషగిరితో కలిసి వారు ప్రారంభించారు. పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించి ఎంపీ, ఎమ్మెల్యే కొద్ది సేపు వ్యాయామం చేశారు. అనంతరం ఉషోదయ కాలనీ ఫేజ్ 1లో సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభివృద్ధి పనులకు ఎన్ని నిధులైనా వెచ్చిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఫాక్స్ డైరెక్టర్ పరిశ శ్రీనివాస్‌యాదవ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

తొలగించారు.. తరలించరా?

- నాలాల్లో వ్యర్థాలు, చెత్తాచెదారాల తొలగింపు
- తరలించకుండా పక్కనే కుప్పలుగా వేసిన వైనం
- దుర్వాసనతో కాలనీవాసుల అవస్థలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



బబ్బుగూడ రైల్వే ట్రాక్ సమీపంలో నాలా నుంచి తొలగించి పక్కనే వేసిన వ్యర్థాలు

మోతీనగర్: మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌లోని పలు బస్తీ, కాలనీల్లో ఇళ్ల మధ్యన ఉన్న ఓపెన్ నాలాల్లో చెత్తా చెదారం నిండి దుర్గంధం, దుర్వాసన వస్తుంది. దీంతో ఇటీవల నాలాలో పూడిక తీశారు. తొలగించిన చెత్తా చెదారాన్ని, వ్యర్థాలను పక్కనే వేయడంతో మళ్లీ మొదటికే వచ్చింది. నెలల తరబడి నాలా పక్కనే కుప్పలుగా నిల్వ ఉంచటంతో అకాల వర్షాలు వచ్చినప్పుడు తిరిగి ఆ మట్టి, వ్యర్థాలు నాలాలోకి వెళ్తున్నాయి. దీంతో మురుగు నీరు, వర్షపు నీరు సక్రమంగా వెళ్లకుండా చెత్తా చెదారం అడ్డుపడుతుంది. ఎప్పుడు చూసినా నాలాలో చెత్తా చెదారంతో నిండి ఉంటున్నాయి. దీనికి తోడు నాలాల నుంచి తొలగించిన చెత్తా చెదారం కుప్పలుగా ఉండటంతో.. ఇదే అదనుగా భావించి కొంతమంది సమీప నివాసితులు రాత్రి వేళల్లో వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని తెచ్చి ఆ ప్రాంతంలోనే వేస్తున్నారు. దీంతో మరింత చెత్తా చెదారం పేరుకుపోయి ఇబ్బందులకు గురవుతున్నారు. బబ్బుగూడ, అవంతినగర్ తోట ఇళ్ల మధ్యన రైల్వే ట్రాక్ కింద ఉన్నటువంటి ఓపెన్ నాలాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని కొన్ని రోజుల కిందట తొలగించారు. తిరిగి దానిని తరలించటంలో సంబంధిత సిబ్బంది నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే కిందిస్థాయి సిబ్బంది వ్యర్థాలను తరలించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆయా కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నాలా నుంచి తీసిన చెత్తా చెదారాన్ని వెంటనే దూర ప్రాంతానికి తరలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నాలా పక్కనే వేశారు



మూసాపేట డివిజన్ బబ్బుగూడలో ఇళ్ల మధ్య ఉన్న ఓపెన్‌నాలాలో కొన్ని నెలల క్రితం పూడికతీత చేపట్టారు. తీసిన చెత్తా చెదారాన్ని నాలా పక్కనే పెద్ద కుప్పగా వేశారు. దీంతో దుర్గంధం దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. వర్షాలు పడ్డప్పుడు ఆ చెత్తా చెదారం తిరిగి నాలాలోకి వెళ్తుంది. తీసిన చెత్తా చెదారాన్ని వెంటనే తరలించాలి.

– బోద శ్రీనివాసరావు, సంక్షేమ సంఘం అధ్యక్షుడు, బబ్బుగూడ